

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 | నవంబరు, 2013 | సంచిక : 6
(విజయ నామ సం॥, ఆశ్వయుజ మాసం)

**గౌరవ సంపాదకత్వం**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**
**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A
**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**
**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.
**Ph : 9440413455, 9848133565**
Website : www.saidhamam.org
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
శ్రీ సాయి సేవ ........ 3
షిరిడీ (కపర్దే) డైరీ ........ 6
స్వరాంజలి-సిగ్గు ........ 8
నేను కాని నేను ........ 9
మౌనం ........ 10
అరక్షిత వృద్ధాశ్రమం ........ 11
ఉషకు ........ 11
భక్తులకొక సూచన ........ 12
మీ గతాన్ని తెలుసుకోండి ........ 13
శ్రీ గజానన విజయం ........ 14
శ్రీ సాయితో తర్ఖడ్ స్మృతులు ........ 18
స్వరాంజలి ........ 21
శుభాశీస్సులు ........ 22
సాయిధామ బాలోత్సవం ........ 22
మాతృసంస్థ కబుర్లు ........ 23
నిశ్శబ్ద సంగీతం ........ 26







# మా వాణి



## దీపోత్సవాలు

ప్రియ పాఠకమిత్రులందరికీ దీపావళి, కార్తీక పూర్ణిమల శుభాకాంక్షలు. దీపావళితో ప్రారంభించి కార్తీక మాసాంతం వరకు యావద్భారతదేశం దీపకాంతులతో మిలమిలలాడుతూ ఉంటుంది. కృత్తికా నక్షత్రం అగ్నితార అనీ, ఆ మాసమంతా అలా జ్యోతిరూపంలో అగ్ని ముంగిళ్లలో నిలచి ఉండాలనీ శాస్త్రం చెప్తుంది. దారితప్పి నడిచేవాడు ఎంతటి ఆప్తుడైనాగానీ-చివరకు కన్నకొడుకైనా సరే వధ్యుడేగానీ వంద్యుడు కాడు. వాడు సమాజానికి ద్రోహిగా రూపొందుతున్నపుడు-అందునా స్త్రీని అవమానించడానికీ, ఆమె నిండు జీవితాన్ని తన క్షణిక సుఖం కోసం వెలపెట్టడానికీ సిద్ధమవుతున్నపుడు-కండకావరంతో తల్లీ చెల్లీ వావివరుసలు కూడా మరిచి రాక్షసప్రవృత్తితో చెలరేగుతున్నపుడు-వాడు తన కడుపున పుట్టిన బిడ్డే అయినా సరే-లోక క్షేమార్థం వాడిని స్వహస్తాలతో చపండానికి కూడా వెనుకాడరాదన్న ఒక మహోన్నత ధర్మాన్ని సత్యభామా కృష్ణుల నరకాసుర సంహారగాధ మనకు అందిస్తున్నది. (నరకాసురుడు పదహారు వేలమంది రాచకన్నెలను చెరబట్టాడన్న విషయం లోకవిదితమే.) ఇది భారతీయ ధర్మం. వాడెంత మందిని నాశనం చేసినా, ఎన్ని కొంపలు కూల్చినాగానీ "అయ్యో, నా కొడుకు చస్తాడేమో!" అన్న భత్కల్ తండ్రి తీరు మన ధర్మానికి చెందనిది. అలాటివాడెవడైనా భారతీయులైనప్పటికీ పరులేగానీ మన వారు కారన్నది నిర్ద్వంద్వం. అలనాటి 'మదర్ ఇండియా' సినిమాలో నర్గీస్ పాత్ర ద్వారా యీ విశిష్ట ధర్మాన్నే మరోసారి ప్రతిపాదించారు. ఇది శిరోధార్యం మనందరికీ. అందునా ఉగ్రవాదులూ, నారీ జీవనభక్షకులూ చెలరేగే యీ తరుణంలో పదేపదే స్మరించుకోవలసిన విషయం యిది.

**(మిగతా 12వ పేజీలో)**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

ఓ పెద్ద ఆడవాళ్ల గుంపు మలుపు తిరిగి వచ్చింది. "వదినగారూ, మహారాణి వారు అమ్మవారికి తెచ్చిన రత్నహారం అద్భుతంగా ఉంది గదండీ" అని ఒకావిడ అన్నది. వెంటనే మరొకావిడ "ఏం లాభంలే వదినగారూ! ఆ శివుడికి మనస్సు కరగకా పోయె ... ఆ గంట మ్రోగకాపోయె" అన్నది.

ఇప్పుడు బాబుగాడికి సందేహం మొదలైంది. "చెల్లీ! ఇంతమంది ఇన్నిన్ని పెద్దపెద్ద కానుకలిస్తేనే శివునికి దయ కలగటం లేదే! మనం యీ కొంచెం పాలు, పళ్లు ఇస్తే ఆయన గంట కొడతాడంటావా?" అన్నాడు. చిట్టితల్లి బుంగమూతి ముందుకుచాపి "ఏమో! నాకేం తెలుసు!" అంది. "సరేలే! అమ్మ వెళ్లమన్నదిగదా-పోదాం పద" అంటూ ముందుకు నడిచాడు బాబు.

అప్పటికే పది గంటలు దాటింది. ఎండ చురుక్కుమంటోంది. ఒక ముసలవ్వ చేతిలో ఖాళీ భిక్షపు గిన్నెతో తడబడే అడుగులతో మెల్లగా నడచివస్తోంది. 'సాంబ సదాశివ, శివ సాంబశివా!' అంటూ నామజపం చేసుకుంటూ నడుస్తోంది. ఆమెకు నిన్నంతా జ్వరం. రాత్రి ఏమీ తినలేదు. ఉదయం నుంచీ ఆమెకు ఎవ్వరూ ఏమీ పెట్టలేదు. నీరసంగా ఉంది. అడుగులో అడుగు వేసుకొంటూ నడుస్తున్న అవ్వకు కళ్లు తిరిగాయో, ఎదురేమైనా తగిలిందో మరి-ధన్‌మని పడిపోయింది. ఆమె రోడ్డు ప్రక్కకీ, చేతిలోని గిన్నె మరోప్రక్కకీ.

"అయ్యయ్యో! పాపం, పోయిందా ఏం!" అన్నారు పట్టుచీరల్లో ఉన్న తల్లులు. "బ్రతికే ఉంది" అన్నారు పరిశీలనగా చూచి అయ్యలు. విడ్డూరంగా ఓ క్షణం ఆగి చూచి వెళ్లిపోతున్నారు పిల్లలు.





"శివరాత్రి నాడు పోతే యిక కైలాస ప్రాప్తే! అదృష్టవంతురాలే!" అంటున్నారు కొందరు. "వెధవ పీనుగ - నడిరోడ్డు మీద పడి చచ్చిందేం!" అంటూ పట్టు పంచె పైకి పట్టుకొని మరీ వెళ్లిపోయాడు ఒక పంతులు గారు. అందరూ వెళ్లిపోయారు.

బాబు అవ్వ పడిపోవటం దూరం నుంచే చూచాడు. చేతిలో ఉన్న పాలు తొణికిపోతున్నా లెక్క చెయ్యకుండా పరుగెత్తుకు వచ్చాడు. చెంబు క్రిందపెట్టి, అవ్వను లేపబోయాడు. వాడికి చేతకాలేదు. ప్రక్కనే కూర్చొని అవ్వ తల ఒళ్లో పెట్టుకొని, చెంపకు అంటిన దుమ్మంతా దులుపుతూ "అవ్వా, అవ్వా, కళ్లు తెరువవ్వా!" అంటూ కుదుపసాగాడు. అవ్వ కళ్లు తెరిచేందుకు ప్రయత్నం చేస్తున్నదిగానీ చేతకావటం లేదు. దానితో బాబు గాడికొక ఆలోచన వచ్చింది. చెంబులోని పాలు కొద్దికొద్దిగా అవ్వనోట్లో పొయ్యసాగాడు. రెండు మూడు గుక్కలు మింగాక అవ్వ మెల్లగా కళ్లు తెరిచింది.

అంతలో బుడిబుడి నడకలతో అక్కడికి వచ్చిన చిట్టితల్లి తన దగ్గరున్న అరటిపండొకటి ఒలిచి అవ్వనోట్లో కొంచెం కొంచెంగా పెట్టింది. అదుగో అప్పుడు జరిగింది ఆ విచిత్రం! గుడిగంటలు గణగణ మ్రోగసాగాయి. దానితోపాటు కొన్ని మాటలు వినిపిస్తున్నాయి.

గుడిగంటలు మ్రోగుతున్నవి గణగణగణమని
గంటలలో వినవచ్చెను ఒక కంఠధ్వని
అది పరమశివుని కంఠధ్వని
అది అంటున్నది ఏమని?
"కరుణ కలుగు మానసమే
పరమశివుని మందిరమని!"

-ఆశ్చర్యంతో గంటలు చప్పడు విన్న బాబు "అదిగోనే చెల్లీ! శివుడు గంట కొట్టేసాడే! ఆయనకు ఎవరేమి గొప్ప వస్తువులిచ్చారో!" అన్నాడు. అవ్వ వాడి చెంపలు, చిట్టితల్లి చెక్కిళ్లు నిమిరి "ఏ తల్లి కన్నబిడ్డలురా నాయనా, ఎంత చల్లని మనసులురా మీవి!" అన్నది.

"మా అమ్మపేరు కత్తూరి (కస్తూరి) అన్నది చిట్టితల్లి అమాయకంగా. అవ్వ నవ్వి బాబుతో యిలా అన్నది "చూడు నాన్నా! దేవు(డికి కావలసినవి పూజలు, కానుకలు, నివేదనలు కావు. ఇవన్నీ మన ఆనందం కోసం, మన దోష నివారణ కోసం మనం చేసుకునేవి. భగవంతుడికి కావలసింది ప్రేమ, కరుణ ... యింతే! మీ అమ్మ శివుడి అభిషేకం కోసమని యిచ్చిన పాలు నాకు పోసి నా ప్రాణం నిలిపారు. ఆయనకు నివేదన చెయ్యవలసిన పండునాకిచ్చారు. మిమ్మల్ని ఎవరైనా ప్రేమగా చూస్తే మీ అమ్మకు వాళ్ల మీద అభిమానం కలుగుతుంది గదా! మరి నేను కూడా దేవుని బిడ్డనే. నాకు మీరు ప్రాణదానం చేసారని శివుడికి సంతోషం కలిగిందిరా నాన్నా! అందుకే గంట మ్రోగిందిరా!" అవ్వ సజల నేత్రాలతో అలా అనగానే చిట్టితల్లి చప్పట్లు కొట్టింది సంబరంగా. "భలేభలే-మనమే కొట్టిచ్చాంరా గంట!" అన్నది అన్నతో.

అవ్వ మళ్లీ "బాబూ, నీకు చదవటం వచ్చుగా! హృదయము అనే మాటలో మధ్య రెండక్షరాలు ఏముంటాయో చెప్పు!" బాబు వెంటనే "దయ" అన్నాడు. "అదే నాన్నా తెలుసుకోవలసింది. భగవంతుడు మనిషికి హృదయం యిచ్చాడు. దానినిండా దయ నింపుకొని దీనులైన వారినీ, దుఃఖితులైనవారినీ ఆదుకోవాలి. అదే మానవత్వం. దయ నిండిన హృదయం నిన్ను దేవు(డితో సమానుణ్ణి చేస్తుంది. దయలేని గుండె గుండె కాదు బాబూ, బండరాయి" అన్నది అవ్వ.

బాబు అవ్వ లేవడానికి సాయం చేసాడు. గిన్నె తెచ్చి అందించాడు. "ఇక వెడతాం అవ్వా!" అని చెల్లి చెయ్యి పట్టుకున్నాడు. నాలుగడుగులు వేసి వెనక్కు తిరిగి చూచాడు.... అవ్వలేదు. ఎలా మాయమైపోయింది? బాబుకు అర్థం కాలేదు. గంట మ్రోగుతూనే ఉంది. "కరుణ కలుగు మానసమే పరమశివుని మందిరం" అంటూ.

మాన్యశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి గేయకథకు ఇది స్వేచ్ఛానుసరణ. అవ్వకు బాబు చేసిన సేవ జగత్పిత పరమేశ్వరునికే చెందిందన్న విషయం స్పష్టమే గదా!

**(సశేషం)**







ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

20-12-1911

నేను పెందలకాడ లేచి కాకడహారతికి వెళ్లాను. హారతి పూర్తి అయే సమయంలో నాకక్కడ వామనరావు కన్పించి ఆశ్చర్యపోయాను. తరువాత తెలిసింది - వామనరావు కోపర్‌గాఁవ్ దగ్గరలో బండి ఆపి, బండివాడిని జామకాయలు తెమ్మని పంపాడు. ఎడ్లు కాస్తా పారిపోయాయి. వామనరావు వెదికివెదికి నానా అగచాట్లూ పడ్డాడు. ఈ కథంతా చాలా ఆశ్చర్యకరంగా తోచింది. సాయి మహరాజు "అల్లా మాలిక్" అని మాత్రం అని వెళ్లిపోయారు. నేను విడిదికి వెళ్లి నా ప్రార్థన చేసుకున్నాను. సాయి నడక నుంచీ తిరిగి వచ్చాక ఉత్సాహంగా ఉన్నారు. దర్వేష్ సాహెబ్ ఆ రాత్రి సాయిబాబా రాత్రివేళ తన దగ్గరకు వచ్చారనీ, తన కోరిక నెరవేర్చారనీ చెప్పాడు. నేనీ మాట సాయి మహరాజ్‌తో అంటే ఆయనేమీ అనలేదు. నేనివ్వేళ సాయి కాళ్లకు నూనె రాసాను. ఆ కండరాలు ఎంతో అద్భుతమైన మృదుత్వంతో ఉన్నాయి. మా భోజనం కొంచెం ఆలస్యమైంది. తరువాత నాకు ఆ రోజు వచ్చిన పేపర్లన్నీ చదువుతూ కూర్చున్నాను. సాయంత్రం మసీదుకు వెళ్లి, సాయి ఆశీస్సులు పొందాను. తరువాత చావడి దగ్గర నమస్కారం చేసుకొని వాడాకు వచ్చేసాను. భీష్మ భజనలో రామ్‌మారుతి బువా కూడా పాల్గొన్నాడు. దీక్షిత్ రామాయణం చదివాడు.

21-12-1911

నేను మామూలు ప్రకారమే లేచి, నా ప్రార్థనల తరువాత దర్వేష్ సాహెబ్‌తో మాట్లాడుతూ కూర్చున్నాను. ఆయన తనకు-ముగ్గురు ఆడపిల్లలు, ఒక

అంధురాలు వచ్చి తన తలుపు తడుతున్నట్లు ఒక దృశ్యం కన్పించిందని చెప్పాడు. మీరెవరని అడిగితే ఊరికే సరాదాగా వచ్చామన్నారు. తరువాత వాళ్లు యీయనను తన్ని యిబ్బందిపెట్టడంతో వాళ్లను వెళ్లగొట్టి, ప్రార్థన ప్రారంభించాడు. ఆ ప్రార్థన వింటూనే వాళ్లు పారిపోయారు. అప్పుడతడు గదిలోని వారినీ, గృహసీమలో, గ్రామంలో ఉన్న వారందరినీ ఆశీర్వదించారు. దీన్ని గురించి సాయీ సాహెబ్‌ను అడగమన్నాడతడు. సాయి మసీదుకు తిరిగి వచ్చాక నేను వెళ్లి కూర్చోబోతుండగానే సాయి ఒక కథ ప్రారం భించారు. గతరాత్రి ఎవరో దేనితోనో తన మర్మావయవాల మీద, చేతుల మీద కొట్టారనీ, తాను నూనె రాసుకొని, బహిర్భూమికి వెళ్లివచ్చాననీ, ధుని ముందు కూర్చున్నాక తేరుకున్నాననీ చెప్పారు. నేనిదంతా దర్వేష్ సాహెబ్‌కు చెప్పాను. సమాధానం స్పష్టంగా తెలిసింది. మధ్యాహ్న హారతి తరువాత భావార్థ రామాయణం చదువుతూ కూర్చున్నాను. బాబాను చావడి దగ్గర దర్శనం చేసుకొని తిరిగి శేజారతికి వెళ్లాము. అటుపైన రామ్ మారుతి అభినయంతో సహా భీష్మ భజన విన్నాము. అటుపై దీక్షిత్ రామాయణం చదివాడు.

22-12-1911

నేను వేకువనే లేచి కాకడ హారతికి వెళ్లబోయాను గానీ, మాధవరావు అన్న ఒక విమర్శతో ఆగిపోయాను. కానీ తరువాత మాధవరావే స్వయంగా వెడుతుండటంతో నేను కూడా వెళ్లాను. సాయి మహరాజు విశేషమైన ఉత్సాహంతో కన్పించారుగానీ నిశ్శబ్దంగా మసీదుకు వెళ్లిపోయారు. మేమందరం ఆయనకు నమస్కరించాము. వారు బయటికి వెళ్లి మళ్లీ తిరిగి వచ్చారు. షిణ్డే, దర్వేష్ సాహెబ్ యిళ్లకు వెళ్లేందుకు అనుమతి కోరారు గానీ సరైన అనుజ్ఞ రాలేదు. దర్వేష్ సాహెబ్‌కు జ్వరం వచ్చింది. హాటే ఆయనకు మందులిచ్చాడు. ఇక్కడ టిప్నీస్ తన భార్యతో ఉంటున్నాడని గతంలో అనుకొన్నాం గదా - ఆమె జబ్బుగా ఉంది. హాటే ఆమెకు కూడా చేతనైన మేరకు సాయపడు తున్నాడు. రామ్ మారుతి మహరాజు కూడా ఆమెకు సేవ చేస్తున్నాడు. ఆమెకీ సాయంత్రం ఫిట్ (మూర్ఛ) వచ్చింది చివరికామెను ఏదో ఆవేశించినట్లు తేలింది. దీక్షిత్, మాధవరావు దేశ్‌పాండే, తదితరులు ఆమెను చూడను వెళ్లారు.





ఆమె ఉంటున్న యింటి పూర్వపు యజమానీ, ఇద్దరు మాలవాళ్లు (మహార్లు) ఆమెను దెయ్యాలై పట్టారు. యజమాని తానామెను చంపేసి ఉండేవాడిననీ, సాయిబాబా అలా చెయ్యవద్దని తనను ఆజ్ఞాపించాడనీ అన్నాడు. మహార్లను కూడా బాబాయే దూరం పెట్టారన్నాడు. టిప్నీస్ తన భార్యను వాడాకు మార్చుదామనుకోగానే ఆ దయ్యాలు అలా చేయవద్దని అతన్ని బ్రతిమాలాయి. సాయిబాబా తమను కొడతారని అన్నాయి. ఆ రాత్రి మామూలుగానే భీష్మ భజన, దీక్షిత్ రామాయణం నడిచాయి. అప్పటికి అర్ధరాత్రి కావచ్చింది.

స్వరాంజలి

## సిగ్గు

- అరవింద (శ్రీ రవీంద్రనాథ టాగూర్ (మాతృక)

*ఒంటరిగా బయలుదేరాను*
*మన సంకేత స్థలానికి*
*కానీ, ఆ మూలచీకట్లో*
*నా లోలోపల - ఎవరదీ?*
*వాడి కెదురుపడకూడదని*
*ప్రక్కకు వైదొలగి నిలుచున్నా -*
*కానీ వాడి నుంచీ తప్పకోలేకపోతున్నా.*
*వాడి పొగరుబోతు నడకతో*
*నేల మీది దుమ్మంతా పైకి లేపుతాడు,*
*నేను అనుకొన్న ప్రతి మాటనూ,*
*పెద్ద గొంతుతో అరిచి వీధిన పడేస్తాడు.*
*వాడు - నా అల్పమైన అహంకారమే ప్రభూ!*
*వాడికి సిగ్గు లేదు.*
*కానీ, వాడితో కలిసి నీ ద్వారం చెంత*
*నిలవాలంటే నాకెంతో సిగ్గేస్తున్నది -*
*ఏం చెయ్యను ప్రభూ, ఎలారాను?*

# నేను కాని నేను

**- ఎ. కృష్ణమోహన్**

నేను ఏమిటి? నేను ఏమీ కాను. జంతువులలో, వృక్షములతో పోల్చు కొన్నపుడు నేను మనిషిని. చెడ్డవాళ్లతో పోల్చుకొన్నపుడు మంచివాడిని. మంచివాళ్లతో పోల్చుకొన్నపుడు నేను చెడ్డవాడిని. స్వతహాగా నేనొక భావుకుడిని నేస్తమా!

విషయ సంపర్కంలో నేను గృహస్థుని విషయత్యాగంతో నేను సన్యాసిని. గృహస్థునీ నేనే, సన్యాసినీ నేనే. ఈ రెండున్నూ నా భావస్థితులే. భావము లేనపుడు నేను లేను.

నేను ఎపుడు ఉంటానో, ఎపుడు వుండనో నాకు తెలియదు. ఈ విషయంలో నేను అశక్తుడను, అస్వతంత్రుడను. నేనున్న దానికి సంతోషము లేదు. నేను ఉండని దానికి దుఃఖమూ లేదు.

ప్రకృతి అనే సృష్టిలోని తోటలో నేనొక వికసించని మొగ్గను, వికసించే మొగ్గను, వికసించిన పువ్వును, రాలిపోతున్న పువ్వును, రాలిపోయిన పువ్వును. మళ్లీ మొగ్గనవుతాను, వికసిస్తాను, రాలిపోతాను. మొగ్గనయి వికసించిన దానికి నవ్వనా? రాలిపోతున్న దానికి ఏడవనా? రెంటికి అర్థములేదు.

ఎందుకంటే నేను మొగ్గనివ్వాలని అనుకోలేదు. వికసించాలని అను కోలేదు అలాగే రాలాలనీ అనుకోలేదు. ఈ మూడు స్థితులకు నేను కార ణము కాదు. నా ప్రమేయములేదు. నేను వికసించిన ప్రతిసారీ ఒక క్రొత్త ప్రపంచాన్ని చూస్తాను. ఆశ్చర్యపోతాను. ఇలా ఎన్నిసార్లు చూచానో, యింకా ఎన్నిసార్లు చూడాలో నాకు తెలియదు. తెలియనవసరము జరగడం లేదు. అందువల్ల నా యిష్టాయిష్టాలకు విలువలేదు. అవసరము లేదు. అందువల్ల నేను ఏమీ కాను. నువ్వు నన్ను ఎలా అనుకొంటే నేను అలా కనబడతాను. కాబట్టి నీవల్లే నేను ఉన్నాను. అయినా నేను ఏమీ కాను. నాకు నీవే పేరు పెట్టావు. నీ సౌకర్యం కోసం, నీ అవసరానికి నన్ను వాడుకొంటున్నావు. నిజానికి నేను అనామకుడిని. కావున నేను అప్రమేయుడను.





# మౌనం

**- స్వామీ పప్పా రామదాసు**

మౌనం ఎంత సుఖకరమైనది! సంభాషణ ఎగిసిపడే సాగరం వంటిది. మౌనం నిశ్చల జలోపరితలం వంటిది. మౌనం కలత పడిన మనస్సును తన సహజ, నిశ్చలత్వంలో స్థిరపడేలా చేస్తుంది. శాంతి మౌనం, ప్రేమ మౌనం, పరమ సత్యం మౌనం. సృష్టికంతటికీ కారణం మౌనం కారణం. మౌనం నుండీ విభిన్నమయిన విశ్వం ప్రాదుర్భవిస్తుంది. అన్నిటికీ మౌనమే ఆదీ అంతం కూడా. మధ్య స్థితిలోనే కార్యశీలతా, కలకలం, సంక్షోభం, పిచ్చిపరుగూను. విశ్రమిస్తున్న సర్పం పరుగెత్తి యిటూ అటూ తిరిగి మరల విశ్రమిస్తుంది. నది పుట్టినచోట నిశ్శబ్దంగా ఉంటుంది. ప్రవహించే నీరు సాగరాన్ని చేరి మరల తన నిశ్శబ్దతను పొందేవరకూ చలిస్తూ గలగల చప్పడు చేస్తుంది. నిద్రించే పక్షి ప్రాతఃకాలంలో పైకి లేచి ఒక చెట్టు మీది నుంచీ మరో చెట్టు మీదికి ఎగురుతూ ఇటూ అటూ తిరుగుతుంటుంది. సాయంకాలం కాగానే తన గూటికి చేరి నిశ్శబ్దంగా ఉండిపోతుంది. అన్నీ మౌనంలోంచే పుడతాయి, మౌనంలోకే తిరిగి వెడతాయి. కార్యక్రమం అంతా మౌనంతో పరివేష్టితమై ఉంటుంది.

"India will be raised not with the power of flesh, but with the power of the spirit".

- భరతభూమి శారీరిక శక్తితో అభివృద్ధి పథంలోకి వెళ్లదు. ఆత్మశక్తితో మాత్రమే అది ఎగురుతుంది.

"Concentrated mind is a lamp that shows us every corner of the soul"

- ఏకాగ్రమైన మనసు ఆత్మలోతులలోకి చూడటానికి దీపంలాగా ఉపకరిస్తుంది.

**- స్వామీ వివేకానంద**

## అరక్షిత వృద్ధాశ్రమం సంధ్యలో చేరేందుకు

సాయిధామంలోని అరక్షిత వృద్ధాశ్రమం సంధ్యలో చేరడానికి వృద్ధుల నుండి అప్లికేషన్లు ఆహ్వానింపబడుతున్నాయి. వివరాలు -

1. వృద్ధులు, సంతానంలేనివారు, నిరాధారంగా ఉన్న వారు అయి ఉండాలి - స్త్రీలైనా, పురుషులైనా.
2. తమ పనులు తామే చేసుకోగలిగి, మతిస్థిమితం కలిగినవారై ఉండాలి. దురలవాట్లుండరాదు.
3. హిందూత్వం పట్ల గాఢత, దైవభక్తి ఉన్నవారికి ప్రాధాన్యం.
4. వారిని పరిచయం చేసే వారెవరైనా వెంట రావాలి.

ఈ ప్రకటన చూచిన వారెవరైనా అటువంటి వారికి సహకరించి సాయిధామానికి చేర్చవచ్చు. అట్టి వృద్ధుల ఆలన, పాలనలతోపాటు అంత్యదశలో సేవకు, అంత్యక్రియలక్కూడా బాధ్యత సాయిధామం ఆశ్రమమే తీసుకుంటుంది.

**- ధర్మాధికారి, సాయిధామం**

## ఉషకు

శ్రీ సాయి (అనాథ) శిశుమందిరం ఉషలో క్రొత్తగా ఐదుగురు పిల్లలను తీసుకోవాలనుకొంటున్నాము. నవజాత శిశువుల నుండి రెండేళ్ల వయసు వరకు తీసుకుంటాము. తల్లిదండ్రులిద్దరూ లేని వారిని మాత్రమే బాలికలనైనా, బాలురనైనా స్వీకరిస్తాము. సాయిభక్తులు తమ ఎఱుకన ఉన్న అనాథ శిశువులను ఆశ్రమానికి చేర్చేందుకు ఆయా శిశువుల బంధువులకు సహకరించగలరని ఆశిస్తున్నాము.

**- ధర్మాధికారి, సాయిధామం**

**హైదరాబాదు**





## భక్తులకొక సూచన

పరమపూజ్య గురుదేవులు ఎవరెప్పుడు దర్శనానికి వచ్చినా కాదనే వారు కారు. "బాబా వారి దర్బారు ఎల్లవేళలా తెరిచియుండును" అనే దాన్ని పాటించేవారు. కానీ, వారి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యాను, వారి సాధనకు ఇబ్బంది కలగరాదన్న దృష్టితోనూ కూడా కొన్ని వేళలకు మాత్రమే దర్శనవేళలను పరిమితం చేయక తప్పటం లేదు. భక్తులు ఈ సమయాలను గుర్తు పెట్టుకోవలసిందిగా కోరుతున్నాము.

**ఉదయం గం.10.00 నుండి గం.11.30 ని.ల వరకు**

**సాయంత్రం గం. 5.00 నుండి గం. 6.00ల వరకు**

**ఆదివారం ఉదయం గం.9.00ల నుండి గం.11.30ల వరకు**

ఈ వేళలు పాటించి శ్రీ గురుదేవులకు ఇబ్బంది కలగకుండా చూచుకొందాం. వేళకాని వేళలలో వచ్చి నిరాశపడకుండా ఉందాం.

**- ధర్మాధికారి, సాయిధామం**

### మా వాణి - దీపోత్సవం

**(2వ పేజీ తరువాయి)**

కార్తీక పూర్ణిమనాటి వెన్నెలలో అత్యద్భుతమైన శక్తులుంటాయని మన వైద్యశాస్త్రం, విజ్ఞానశాస్త్రం కూడా ఒప్పుకొన్న విషయం. ఆనాటి వెన్నెలలో అమృత కిరణుడైన చంద్రుని చలువను, శక్తినీ కూడా స్వీకరించటం కోసం మన పెద్దలు వెన్నెలలో పాలు కాగబెట్టి (చంద్రకిరణాలు పడటానికి వీలుగా, మూతలేకుండా) అవితాగి తెల్లవార్లూ జాగరణ చెయ్యాలని ఒక పద్ధతి ఏర్పరచారు. ఈ 'జాగరణ, సత్సంగం, ఆటలు (యువకులకు)- అన్నీ వెన్నెట్లోనే జరగాలి.

అందుచేత మిత్రులారా, ఈ రెండు పండుగల వెనుక ఉన్న పారమ్యాన్ని మన పిల్లలకు వివరిద్దాం. సాంప్రదాయాలన్నవి సద్ధర్మం వైపు జాతిని నడపడానికే. కేవలం పిండివంటలు, క్రొత్త బట్టలు, టపాకాయలు, బంధుమిత్ర సమావేశం - వీటికి మాత్రమే కాదు సుమా!

# మీ గతాన్ని తెలుసుకోండి



- స్వామీ వివేకానంద

గతం నుంచే భవిష్యత్తు రూపుదిద్దుకొంటుంది. కనుక గతంలోకి వీలైనంత వెనుదిరిగి చూసుకో. గతకాలానికి చెందిన పైకి చిమ్మే అమరమైన నీటిధారనుంచి నీటిని గ్రోలిన తరువాత, ముందుకు చూడు; భారతదేశాన్ని ఎన్నడూ లేనంత సుసంపన్నంగా, సర్వోన్నతస్థితికి తీసుకుని వెళ్ళు. మన పూర్వీకులు మహోన్నతులు. ఆ విషయం మనం ముందు గుర్తుంచుకోవాలి. మనకు ప్రాణాధారమైన మూలకాల గురించీ, రక్తనాళాల్లో ప్రవహించే రక్తం గురించీ తెలుసుకోవాలి. ముందెన్నడూ లేనంత ఔన్నత్యాన్ని సంతరించుకున్న భారతాన్ని మనం నిర్మించాలి.


సదా గతం వైపు వెనుదిరిగి చూసే వారిని నేడు ప్రతి ఒక్కరూ ఆక్షేపిస్తున్నారు. గతాన్ని గురించి అతిగా విశ్లేషించుకోవడమే మన దేశ దైన్యానికి కారణమని అనేకులు భావిస్తున్నారు. కాని అందుకు విరుద్ధంగా, ఆ ఆలోచనకు వ్యతిరేకమైనదే నిజమని నేను భావిస్తున్నాను.

హిందువులు ఎంత ఎక్కువగా తమ గత చరిత్రను అధ్యయనం చేస్తే వారి భవిష్యత్తు అంత ఉజ్జ్వలంగా పరిణమిస్తుంది. అందుచేత ఎవడైతే గత చరిత్రను ప్రతి ఒక్కరి అందుబాటులోకి తెస్తాడో అతడే జాతికి మహోపకారం చేసిన వ్యక్తిగా పరిగణింపబడతాడు. మన ప్రాచీనుల, శాసనాలు, ఆచార వ్యవహారాలు లోపభూయిష్టమైనవి కనుక భారతదేశం అధోగతి చెందినదని అనడం భావ్యం కాదు. భారతావని పతనానికి కారణం ఫలప్రదమయ్యే తీరులో ఆ శాసనాలను ఆచారవ్యవహారాలను అమలు పరచలేకపోవడమే.





# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

మహారాష్ట్ర దేశంలోని షెగాం అనే గ్రామంలో దర్శనమిచ్చిన శ్రీ గజానన మహారాజుల వారి దివ్యచరిత్రను భక్తుల కోసం శ్రీ దాసుగణుల వారు (గణేశ దత్తాత్రేయ సహస్ర బుద్ధే) గజానన మహారాజుల వారి భక్తులైన శ్రీ రామచంద్ర పాటిల్‌గారి కోరిక మేరకు మరాఠీ భాషలో ఓవీ ఛందస్సులో వ్రాశారు. శ్రీ సాయినాథుల వారి చరిత్ర చదివిన వారందరికీ ఈ దాసుగణు గారి పేరు పరిచయమే. ఈ పేరు గూడ సాయిబాబా వారు పెట్టిందే.

ఈ గ్రంథాన్ని గజానన్ మహరాజుల వారి వేరొక భక్తులు శ్రీ ఎన్.బి. పాటిల్‌గారు ఆంగ్లంలోకి అనువదించి మరాఠీ భాష రాని అనేకమంది భక్తులకు వారి దివ్య చరిత్రను అందించారు.

ఆంగ్ల గ్రంథాన్ని అనుసరించి వ్రాసిందే యిప్పుడు మీరు చదవబోయే చరిత్ర.

అవధూతల చరిత్రలు శ్రద్ధగా చదవటం వలన వారి పట్ల భక్తి పెరిగి వారి కరుణకు పాత్రులు కావటమేగాక మనస్సు పవిత్రమౌతుంది.

“యోగులందరూ నా స్వరూపులే” అన్నారు శ్రీకృష్ణ పరమాత్మ. పాఠకులందరికీ యోగి కులభూషణుడైన అవధూత శ్రీ గజానన మహారాజుల వారి పరిపూర్ణ ఆశీస్సులు లభించుగాక.

దాసుగణు రచనకు ప్రారంభించే ముందు గణపతితో ప్రారంభించి సరస్వతీదేవి, పాండురంగడు మొదలైన దేవీ దేవతలను వినయంగా ప్రార్థించటం కన్పిస్తుంది. కలం తానంతట తానుగా వ్రాయదు. దాన్ని పట్టుకున్న చేయే వ్రాస్తుంది. అలాగే నేను మీ చేతిలో కలాన్ని మాత్రమే. వ్రాసేది మీరే అని యోగులందరినీ ప్రార్థించాడు.

“ఓ భక్తులారా శ్రద్ధగా మీ మనస్సును భగవానుని మీద నిలిపి

ఏకాగ్రచిత్తంతో ఈ మహాత్ముని గాథను వినండి. యోగుల శరణుజొచ్చిన వారిని భగవంతుడు ప్రేమిస్తాడు.

భారతమాతకు జయమగుగాక.ఎందరెందరో యోగిపుంగవులు యిక్కడ జన్మించి ఈ నేలను పవిత్రకరించారు" అంటూ అనేకమంది పూర్వయోగుల్ని స్మరించారు.

గజాననుల వారి వంటి గొప్ప యోగి చరిత్రను నేను యింతకుముందే ఎందుకు వ్రాయలేదు? అని ప్రశ్నించుకొని - పూలను దండగా దారానికి గుచ్చేటప్పుడు మధ్యలో రావలసిన పెద్ద పుష్పాన్ని ముందుగా గుచ్చరు కదా! అని సమాధానం చెప్పకున్నారు. ఇక కథలోకి వద్దాం.

షేగాం అనేది మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలోని ఒక చిన్న ఊరు. ఆ గ్రామస్థులు ఎంతో అదృష్టవంతులు గనుకనే గజానన మహారాజు వంటి గొప్ప యోగీశ్వరుడు ఆ గ్రామాన్ని తన నివాసంగా ఎంచుకున్నాడు.

గజానన మహారాజు ఎక్కడ నుండి ఆ ప్రాంతానికి వచ్చారో ఎవ్వరికీ అంతుచిక్కలేదు. మొట్టమొదటిసారిగా గజాననులు శక సంవత్సరం 1800లలో మాఘమాసం కృష్ణపక్షం సప్తమినాడు కన్పించారు (ఇది 23 ఫిబ్రవరి 1878కి సరిపోతుంది)

వీరు సమర్థ రామదాసుల వారి సన్నిధిచే పవిత్రీకరింపబడిన సజ్జన గఢ్ నుండి వచ్చి ఉండవచ్చునని భావించారు. యోగులు లోకకళ్యాణం కోసం మళ్ళీ మళ్ళీ ఏ రూపంతోనైనా వస్తూ ఉండవచ్చు గాక!

గోరఖనాథులు పేడకుప్పలోంచి ఆవిర్భవించారు. కనీఫ నాథులు ఏనుగు చెవిలోంచి పుట్టారు, చాంగదేవులు నీటి బిలంలోంచి పుట్టారు. వీరంతా అతి స్వచ్ఛమైన జన్మలు కలిగినవారే. ఆ విధంగానే మన మహారాజుల వారున్నూ.

వారు మొట్టమొదట ఒకానొక విచిత్ర పరిస్థితిలో కన్పించారు. పీలికలైన ఒక కాపీనం ధరించి చెత్త కుండీ దగ్గర కూర్చొని ఎంగిలి





విస్తరాకులలోంచి మెతుకులు ఏరుకుంటూ కనిపించారు. ఒక చేతిలో చిలుము ఉన్నది. దృష్టి అంతా అలౌకికంగా ఉన్నది. ముఖం ఉదయభానుని తేజస్సుతో వెలిగిపోతున్నది.

ఆ చెత్తకుండీ దేవీదాసు అనే గ్రామస్థుని ఇంటి ముందు ఉన్నది. ఆ యింట్లో అంతకుముందే విందు జరిగింది. బంకట్‌లాల్ అగర్వాల్, దామోదర్ కులకర్ణి అనే యిద్దరు ఆ త్రోవన పోతూ గజాననులను గమనించారు. అంతకుముందు ఎందరో అటుగా పోయారు కాని, ఈ మణిని గుర్తించే ప్రాప్తం వారికి లేదు. ఆ ఎంగిలి మెతుకులు ఏరుకుంటున్న ఆయన ఒక పిచ్చి బిచ్చగానివలె అనిపించలేదు. ఆయన ఆకలితో బాధపడుతున్నట్లూ కనిపించలేదు. ఆ తేజస్వియైన వ్యక్తి అడిగితే ఏ బుద్ధిమంతుడు కూడా అన్నం పెట్టడానికి తిరస్కరించి ఉండడు. బంకట్‌లాల్ కులకర్ణితో "ఈయన సామాన్య వ్యక్తిగా కనపడటం లేదు. భాగవత గ్రంథంలో చెప్పలేదా యోగులు పిచ్చివాళ్ళుగా ప్రవర్తిస్తారని. ఈయన ప్రవర్తన మూర్ఖంగా కన్పిస్తున్నా, ముఖకవళికలు దివ్యజ్ఞానిని తలపిస్తున్నాయి" అని, ఆ వ్యక్తిని సమీపించి, "భోజనం కావాలా?" అని అడిగాడు. ఆయన ఏ సమాధానం చెప్పలేదుకాని ముఖం మాత్రం సంతోషంతో విప్పారింది. ఆయనది అందమైన ఆకారం. విశాలమైన రొమ్ము, దృఢమైన కండరాలు. ఒక విస్తట్లో ఆహారపదార్థాలన్నీ వడ్డించుకొని తెమ్మని బంకట్‌లాల్ దేవీదాసుకు చెప్పాడు. అలా తెచ్చి ముందరపెట్టగానే ఆ స్వామి దానిని తాకి అన్ని పదార్థాలూ కలిపివేసి కొద్దిగా ఆహారం నోట్లో పెట్టుకున్నారు. నిత్య సంతృప్తులకు మృష్టాన్నం ఒక లెక్కా! దీన్ని జాగ్రత్తగా గమనిస్తున్న బంకట్‌లాల్ దామోదరుడితో యిలా అన్నాడు-"చూశావా, ఈయన మొదట మనమనుకొన్నట్లు మూర్ఖుడూ, పిచ్చివాడూ కాదు, గొప్ప జ్ఞాని. ఇంకా మనం ఈయనను పరీక్షించ పనిలేదు. వీరు యిక్కడకు వచ్చినందువలన మన ఊరికెంతో మేలు. వీరిని గుర్తించగలిగిన

మనమూ భాగ్యశాలురమే". ఆయన ఆహారం స్వీకరించిన సమయం మిట్ట మధ్యాహ్నం. ఆయన దగ్గర ఉన్న కమండలంలో నీళ్ళు లేవు. వాళ్ళు నీళ్ళు తెచ్చిపెట్టడానికి కమండలం యిమ్మని అడిగారు. "సరే మీకిష్టమైతే తీసుకురండి" "ఈ బ్రహ్మం భోజనం చేసింది. ఇక యిప్పుడు నీళ్ళు త్రాగాలి కదా" అన్నారు. ఆయన మాట్లాడటం వినగానే వారికి సంతోషం కలిగింది. దామోదర్ నీటికోసం యింట్లోకి వెళ్ళాడో లేదో ఈ స్వామి లేచి ఆ దగ్గరలోనే పశువులు త్రాగే నీటి తొట్టి దగ్గరకు వెళ్ళి దాంట్లోని నీటిని త్రాగసాగారు. దామోదర్ నీటితో నింపిన కమండలంతో పరిగెత్తుకుంటూ వచ్చి "అయ్యో స్వామీ! అవి పశువులు త్రాగిన మురికినీళ్ళు. ఇదిగో మీ కోసం శుభ్రమైన చల్లని నీటిని తెచ్చాను. స్వీకరించండి" అన్నాడు. దానికి ఆ స్వామి -

"నాయనా అలా అనవద్దు, ఈ విశ్వమంతా ఒకే సత్యపదార్థం చేత ఆవరింపబడి ఉన్నది. శుభ్రమైనవో, అశుభ్రమైనవో, ఘాటైనవో, తియ్యనివో అన్నీ కూడా ఆ పరబ్రహ్మం యొక్క వ్యక్తస్వరూపాలే కదా!" త్రాగేవాడు, త్రాగబడేదీ వేరు వేరు కాదు. ఆ విశ్వప్రభుని మీద మీ దృష్టిని కేంద్రీకరించి ఈ విషయాన్ని అవగాహన చేసుకోండి" అన్నారు.

ఈ వేదాంత విషయాలు వింటూనే వారికి ఆయన పట్ల అమితమైన భక్తి ఏర్పడింది. భక్తితో సాష్టాంగ నమస్కారం చేయబోయేటప్పటికల్లా ఆయన అక్కడి నుండి పరుగెత్తుకొని వెళ్ళిపోయాడు.

---

A teacher who knows no more than the students ought to know, nothing is worse than such a teacher.

***-- Goethe (Greek Poet)***

- విద్యార్థులకు నేర్పవలసిన దానికంటె ఎక్కువజ్ఞానం లేని ఉపాధ్యాయుడికన్నా వ్యర్థుడు మరొకడుండడు.

**- గిటే**





# సాయితో తర్ఖడ్ స్మృతులు-6

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

ప్రియమైన సాయిభక్త పాఠకులారా! యింతవరకు నేను చెప్పిన యీ అనుభవాలన్నీ కూడ మీకు నచ్చాయని నేను అనుకుంటున్నాను. మన సాధారణ జీవితచక్రం ఎలా ఉంటుందంటే - మొదట మన సంసార జీవితానికి అల్లుకోవాలి. తరువాత మనకు తీపి, చేదు అనుభవాలు కలుగుతూ ఉంటాయి. వాటిని అనుభవించాక, మనం చివరికి మనశ్శాంతి కోసం ఆధ్యాత్మికత వైపు ఆకర్షితులమవుతాము కాని, ఈ చక్రం మా నాన్నగారి విషయంలో తిరగబడింది. ఆయన దివ్యానుభూతులను పొంది, ఆ తరువాత సంక్లిష్టమైన సంసారజీవితాన్ని అనుభవించవలసి వచ్చింది.

ఒక విషయం మాత్రం తేటతెల్లం, ఎందుకంటే సాయిబాబా సాహచర్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే నేర్పును పొందే అవకాశం వచ్చింది.

నేను కూడ నమ్మేదేమిటంటే భక్తిమార్గంలో ఒకసారి సాధన మొదలు పెట్టాక సాధకుడు జీవితంలో ఎటువంటి భయాన్నయినా ఎదుర్కొనేందుకు చక్కగా సన్నద్ధమౌతాడు. ఇప్పటికి మా నాన్నగారు షిరిడీకి చాలాసార్లు వెళ్ళారు. ఆయన ఖాతాలో దివ్యానుభూతులను జమ చేసుకుని తగినంతలో ధనవంతుడయ్యారు. ఇప్పుడు కొన్ని తిరకాసు క్షణాలను, ఎదుర్కొనే సమయం వచ్చింది. అప్పడవి శీతాకాలపు రోజులు, పగటి రోజులు సమయం ఎక్కువ. రాత్రివేళ సమయాలు తక్కువగా ఉండేవి. అటువంటి ఒకరోజున సందెచీకటి వేళ ఆకాశంలో మిణుకుమిణుకు మంటున్న నక్షత్రాలు కనబడుతున్నాయి. తాము బయటికి వెడుతూ బాబా నాన్నగారిని తమతోకూడా రమ్మన్నారు. అది ఊహించని ఆహ్వానం.

కారణం, బాబా అటువంటి సమయంలో ద్వారకామాయిని విడిచి ఎప్పడూ వెళ్లరు. ఆయన "లెండీబాగ్"వైపు నడుచుకుంటూ అక్కడి నుంచి యింతకుముందు అధ్యాయంలో వివరించినటువంటి వాగు ఒడ్డు వద్దకు వచ్చారు. అప్పటికి పూర్తిగా చీకటిపడింది.

చంద్రుడు ఆకాశంలో పైకి వచ్చాడు. అప్పడు బాబా మా నాన్నగారితో తాను ఆయనకు ఒక విచిత్రం చూపించబోతున్నాననీ, ఆ కారణం చేతనే ఆయనను ఆ చోటు వద్దకు తీసుకువచ్చాననీ చెప్పారు. ఏమయినప్పటికీ బాబా తనపై వ్యక్తిగతంగా కొంత ప్రత్యేకమైన శ్రద్ధను చూపిస్తున్నందుకు మా నాన్నగారు చాలా సంతోషించారు. అప్పడు వారు క్రింద కూర్చున్నారు. బాబా మెత్తగా ఉన్న మట్టిని తన చేతితో తొలగించడం మొదలుపెట్టారు. ఆయన మా నాన్నగారితో మట్టిలోకి చూడమని చెప్పి "ఏమయినా కనపడుతోందా?" అని అడిగారు. మా నాన్నగారు చూసి లేదని చెప్పారు. బాబా తిరిగి మరల అదే పనిచేశారు. మా నాన్నగారు రెండవసారి చూసి తనకు మట్టి మాత్రమే కనపడుతోందని చెప్పారు. అపుడు బాబా మూడవసారి తిరిగి అదే పని చేసి మా నాన్నగారి తల వెనుక తన చేతితో కొట్టి ఆయనతో జాగ్రత్తగా చూడమని చెప్పారు. మా నాన్నగారు ఆ ప్రదేశంలో చూడగా అక్కడ మెరుస్తున్న లోహం ఉంది. వెన్నెల వెలుగులో అది యింకా మెరుస్తూ కనపడింది. బాబాతో మా నాన్నగారు ఒక లోహపు వస్తువు మెరుస్తూ కనబడుతోందని చెప్పారు.

అప్పడు బాబా "భావూ, ఆ లోహం బంగారం తప్ప మరేమీ కాదు. నీకు ఎంత కావల్సివస్తే అంత తీసుకో అన్నారు. మా నాన్నగారు బాబాతో "బాబా నాకిది వద్దు. మీ ఆశీర్వాదంతో మాకన్నీ ఉన్నాయి. మీనుంచి అటువంటి భౌతిక సంబంధమయిన వాటిని తిరిగి పొందుదామనే ఉద్దేశ్యంతో నేను షిరిడీకి రాను" అన్నారు. అప్పడు బాబా ఆయనతో "భావూ యిది లక్ష్మీదేవి. ఆమెకు నువ్వంటే యిష్టం కలిగింది. ఒక్కసారి కనుక నువ్వు ఆమె ఇచ్చిన వరాన్ని తిరస్కరిస్తే ఇక ఎప్పడూ ఆమె నీ వద్దకు రాదు. కనీసం యీ జన్మలోనయినా. అందుచేత మరలా ఆలోచించుకో"





అని ముందుజాగ్రత్తగా చెప్పారు. అప్పడు మా నాన్నగారు ఆయనతో "బాబా! నువ్వు నన్ను పరీక్షకు గురిచేస్తున్నావు. నేను యీ మాయకు ఎరను కాబోను. నా మీద నీ ఆశీర్వాదములున్నంత వరకూ యీ మాయ లేకుండా నేను ప్రశాంతంగా, సుఖంగానే జీవిస్తాను" అన్నారు. అప్పడు బాబా తిరిగి మట్టిని కప్పివేశాక యిద్దరూ ద్వారకామాయికి తిరిగి వచ్చారు.

ఆ సమయంలో ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. షిరిడీ స్థానికుడు ఒకడు వాగు ఒడ్డున జరిగినదంతా చూశాడు. సాయిబాబా మా నాన్నగారికి పాతిపెట్టబడిన నిధి ఏదో చూపించి ఉంటారని ఊహించాడు. బాగా రాత్రి పొద్దుపోయాక ఆ చోటికి వెళ్లి ఆ నిధిని త్రవ్వి తీసుకుందామనుకున్నాడు. అనుకున్న విధంగా నిధి వేటకి సాహసం చేయడానికి అర్ధరాత్రి లేచి వెళ్లాడు. కానీ, ఎప్పడయితే అతను గడ్డపార మీద చేతులు వేశాడో, వెంటనే అతని వేళ్ల మీద తేలు కుట్టింది. పాపం అతను రాత్రంతా బాధపడుతూనే ఉన్నాడు. ఉదయమయ్యేటప్పటికి బాధ భరింపరానంతగా ఉండటంతో తెలివిగా సాయిబాబా దగ్గరకెళ్లి తన తప్ప ఒప్పకుందామని నిశ్చయించుకున్నాడు. తాను రాత్రి నిధివేటకు వెళ్లిన విషయం బాబాకు తప్ప మరెవరికీ తెలియపరచకూడదనుకున్నాడు.

అతను ద్వారకామాయిలోకి ప్రవేశించినప్పడు విపరీతమయిన బాధతో ఉన్నాడు. మా నాన్నగారు, ఆ స్థానికుడు బాబాను తన తప్పను మన్నించమని వేడుకుంటూ, ఇక ఆ పాపం ఎప్పడూ చేయనని చెప్పడం చూచారు. తేలు కుట్టడం వల్ల కలిగిన భరింపరాని బాధ నుంచి విముక్తి చేయమని ఆయన అడిగాడు. బాబా అప్పడు "ఎవరయినా తనకు దైవ సంకల్పితంగా నిర్దేశింపబడిన ధనాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తే దాని అర్థం మరెవరినైనా తీసుకోమని కాదు. ఈ ప్రపంచంలో భగవంతుడు ఎవరి అదృష్టాన్ని బట్టి వారికది లభించేలా ఒక నియమాన్ని ఏర్పరిచాడు. ఎవరయితే ఈ నియమాన్ని ఉల్లంఘిస్తారో అతను భగవంతుని చేత శిక్షింపబడతాడ"ని చెప్పారు. మా నాన్నగారికి ఆ సంభాషణ అర్థమయింది. బాబా తన పవిత్రమైన ఊదీని తేలుకుట్టిన అతని వేలిపై రాసి, భవిష్యత్తులో

చెడుగా ప్రవర్తించవద్దని చెప్పారు. భగవంతుడు అతన్ని ఈ బాధ నుండి తప్పిస్తాడని ఆశీర్వదించారు. షిరిడీలో మా నాన్నగారికి పెట్టబడిన “బంగారు పరీక్ష” అదీ. నేను అనుకునేదేమంటే ఆయన అటువంటి మాయకు ఎర కాకుండా సఫలీకృతులయ్యారని, కానీ ఒక విషయం మటుకు ఖచ్చితం, ఏమిటంటే భవిష్యత్తులో ఆయన ధనాన్ని కూడబెట్టుకో లేకపోయారు. లక్ష్మీదేవి ఆయన వద్దకు వెళ్ళడం మానుకొంది. ఆయన ఆర్థిక పరిస్థితి అలాగే ఉంది.

## స్వరాంజలి

- సుమంత

*విన్నారె ......*
*విన్నారె సఖులారా : విన్నారె!*
*లోలోన ధ్వనియించే ఆ పిలుపు*
*విన్నారె .... ॥ వి ॥*

*అల్లంత దూరాన ఆ వనాంతరాన*
*మ్రోగెనదే మోహనాంగుని మురళి*
*వేచియున్నాడె-వేగ రమ్మన్నాడె*
*చేరిపోవలెనాతని దివ్య సన్నిధికీ ॥ వి ॥*

*శ్రీ షిరిడి గ్రామాన ద్వారకామాయిలో*
*కొలువయ్యెనే ప్రభువు శ్రీ సాయి రూపాన*
*ప్రేమనిమ్మన్నాడే - దరిజేర్తునన్నాడే*
*సహనాన సేవింపవలె నా స్వామినీ ॥ వి ॥*

*నా హృదయ కుహరాన వేరేకు కమలాన*
*నిలచియున్నాడె నా స్వామి నిర్మలానందమూర్తి*
*సాక్షిగా నున్నాడె - సర్వధీ సాక్షియే*
*పట్టవలె నాతని గట్టి సాధనతోడ ॥ వి ॥*







## శుభాశీస్సులు



శ్రీ సాయి విద్యాధామం పూర్వ విద్యార్థి చి॥ తోకల శ్రీకాంతరెడ్డి మూడుచింతలపల్లె గ్రామవాసి-వీరారెడ్డిగారి పుత్రుడు, ఆశ్రమ అభిమాని చి॥ సదాశివరెడ్డి (సదాలు) తమ్ముడూను. చి॥ శ్రీకాంత్‌రెడ్డి వివాహం ఆగస్టు 25వ తేదీ ఆదివారం ఉదయం గం.10-22 ని.లకు చి॥సౌ॥ జ్యోతితో - అత్వెల్లిలోని దివాన్ ఫంక్షన్‌హాల్‌లో శాస్త్రోక్తంగా జరిగింది. “ఈ వధూవరులిద్దరూ కలకాలం అన్యోన్యంగా జీవించి, సత్సంతిని కని, వారిని లోకోపకారులుగా తీర్చిదిద్ది, దేశమాత ఋణం తీర్చుకుందురు గాక!” అని గురుదేవులు ఆశీర్వదిస్తున్నారు. తథాऽస్తు!

## శ్రీ సాయిధామ బాలోత్సవం

ప్రియ పాఠకలోకానికి,

శుభాకాంక్షలు. సాయిధామం ‘ఉష’ ‘ప్రత్యూష’లలోని బాల బాలికలకు ప్రతి సంవత్సరం మాదిరిగానే నవంబరు 25వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక ‘బాలోత్సవ’ కార్యక్రమం జరుగుతుంది. అభిమానులు, హితచింతకులూనైన పెద్దలంతా మీ హార్దిక శుభాశీస్సులను వారికి పోస్టుద్వారాగానీ, స్వయంగా వచ్చిగానీ అందించగలరని ఆశిస్తాము. మాకెందరు పిన్నమ్మలు, బాబాయిలు, తాతయ్యలు, అమ్మమ్మలు, మామయ్యలు, అత్తయ్యలో! - అని ఆ చిన్నారులు పొంగిపోతే ............. అదే శ్రీ సాయిరక్ష వారికి సరేనా!

**- ధర్మాధికారి**

# మాతృసంస్థ కబుర్లు

సెప్టెంబరు 5వ తేదీన సాయిధామం ఆశ్రమవాసులు మాతా శుకవాణి, రాంబాబు, శ్రీ సాయి విద్యాధామం విద్యార్థులు కొందరు, మాన్యమిత్రులు శ్రీ కె.చంద్రారెడ్డిగారు కలిసి దోమలగూడాలోని శ్రీ రామకృష్ణమఠంకు వెళ్లారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన భీభత్సంలో చిక్కుకొని ఊళ్లకు ఊళ్లే సర్వనాశనమై, మాయమైపోయిన విషయం మనకందరికీ తెలుసు. ఆ ఉత్పాతంలో నిలువనీడను, ఆప్తజనులను కోల్పోయి పరమభయానక పరిస్థితులలో అల్లాడే సోదర భారతీయులకు రక్షాహస్తం అందించటం కోసం శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ నిర్ణయించింది. అందుకు స్పందించిన శ్రీ సాయి విద్యాధామం బాలబాలికలు ఏడు వేల రూపాయల విరాళం పోగు చేశారు. ప్రశాంతి వృద్ధులు ఐదువేల రూపాయల విరాళం ప్రకటించారు. వీటికితోడు ఆశ్రమానికి వచ్చిపోయే భక్తులు, అభిమానులు కాస్తాకూస్తా మా "ఇచ్చిన వచ్చును" డబ్బాలో వేసినది కలిసింది. ఆ మొత్తానికి మరో పాతికవేలు ఆశ్రమం జతచేసి మొత్తం రూ.50,000/- చేసింది. ఈ మొత్తాన్ని శ్రీరామకృష్ణమఠం వారికి అందజేద్దామని సంకల్పించారు- పరమపూజ్య గురుదేవులు. ఆ మేరకు పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ జ్ఞానదానంద స్వామివారికి చెక్కు అందజేయడానికి మా పటాలమంతా రామకృష్ణ మఠం వెళ్లింది.

మొదట శ్రీరామకృష్ణ మందిరంలోకి వెళ్లి పరమహంస వారి దర్శనం చేసుకున్నాము. ఆ ప్రశాంతత, నిర్మలత్వం, నిశ్శబ్దంగా ధ్యానం చేసుకొనే భక్తుల భావ ప్రకంపనల శక్తీ అనుభూతం చేసుకొంటూ కొంతసేపు అక్కడ గడిపాము. అక్కడ పూజ పూర్తిచేసి జపం చేస్తున్న బ్రహ్మచారి ఆహార్యం, ప్రసన్నత, పొరపాటునైనా తలతిప్పని ఏకాగ్రత నన్నెంతగానో ఆకర్షించాయి. వివేకానందులు, శారదామాతలకు నమస్కరించుకొని తీర్థం తీసుకొని





బయటికి వచ్చాము. చుట్టూ ఉన్న మొక్కలను, పువ్వులను చూస్తూ, పిల్లలకు రామకృష్ణులను గూర్చి, శారదామాతను గూర్చి చెప్తూ మెల్లగా స్వామీజీ గది దగ్గరకు వెళ్లాము. అది వారి దర్శనవేళే కావటంతో త్వరగానే దర్శించుకోగలిగాము. ఫలపుష్పాదులతోసహా చెక్కు సమర్పించుకొన్నాము. స్వామీజీ పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. సాయిధామం ఆశ్రమం ఉచిత పాఠశాల నడుపుతున్నదని విని 'ఎ గ్రేట్ సర్వీస్' అన్నారు. ఆశ్రమ బాలుడు చి॥ నందన్‌ను స్వామీజీ ప్రశ్నించగా "నేను ఆశ్రమంలోనే చిన్ననాటి నుండీ పెరిగాను. ఆశ్రమాభివృద్ధే నా ధ్యేయంగా జీవించదలచు కున్నాను" అని చెప్పాడు. అది విని స్వామీజీ "చాలా సంతోషం. మీ ఆశ్రమం వృద్ధి చెయ్యటమే కాదు-అనేకానేక ఆశ్రమాలు రావాలి యింకా. ఆశ్రమాల ద్వారానే సేవ జరగాలి" అని ఆశీర్వదించారు. పిల్లలందరికీ స్వామీజీ వివేకానంద జీవిత చరిత్రలు పంచారు. వారి దగ్గర సెలవు తీసుకొని, పిల్లలు ఆశ్రమం అంతా తిరిగి చూస్తోంటే మేము పుస్తకశాలలో కొన్ని గ్రంథాలు కొనుక్కొన్నాము.

అటుపైన టేంక్‌బండ్ మీద వెలసిన ఆంధ్ర వీరులు, కవి, గాయకులు, మహానాయకుల విగ్రహాలు చూస్తూ తిరిగి వచ్చాక, ఆశ్రమం త్రోవపట్టాము. పిల్లలంతా మఠదర్శనం చేసినందుకు, ఒక మహత్కార్యంలో తాము కూడా చిట్టి ఉడతలమైనందుకు కూడా ఎంతో ఆనందించి, అందుకు ప్రోత్సహించిన మాతాజీకి తమ కృతజ్ఞత తెలియజేసారు. ఈ కార్యానికి ఆమోదముద్ర వేసి ఆశీర్వదించిన గురుదేవులకు పాదాభివందనాలు సమర్పించుకొన్నారు మాతాజీ.

సెప్టెంబరు 9వ తేదీ వినాయక చవితి. ముందరిరోజు ఆదివారం. ఆ ముందరిరోజు తెలంగాణా బంద్. అంచేత పిల్లకాయలన్నీ కాస్త స్వేచ్ఛగా, తీరుబడిగా వినాయకులను తయారుచేసుకొన్నారు. కాగితం గుజ్జుతో, పిండితో, మట్టితో రకరకాల వినాయకులు తయారయ్యారీసారి. కొందరు తళుకుబెళుకులు చూపిస్తే, కొందరు కిరీటధారులయ్యారు. ఇంకొందరు నిరాడంబరంగా కూర్చున్నారు. మొత్తం మీద ఎవరికి వారే స్పెషల్‌గా

అవతరించారు. వాసుగాడి గణపతికి కొంచెం నడ్డి వస్తే జ్ఞానేశ్వర్ గణపతికి బొజ్జ కాస్త ఎక్కువ పెరిగింది. గున్నుగాడి గణపయ్య తొండానికి టైఫాయిడ్ వచ్చిందని అనుమానం-మరీ చిక్కిపోయింది. మా కొత్త టీచరు కవిత ఆడపిల్లలకు బొమ్మలు చేయటంలో సాయం చేసారు. అలా చేస్తోంటే కవితక్క ఎలుకలు బాగా చేస్తున్నారు" అన్నారెవరో. వెంటనే చైత్ర "మొన్నెప్పుడో ఎలుక కరిచింది గదా కవితక్కను. అందుకని బాగా కుదురుతున్నాయి ఎలుకలు" అనేసింది. కాస్సేపు నవ్వుల పువ్వులు. సాయిచంద్ర సుమారు అడుగున్నర గణపతిని చేసి హంగులు దిద్దాడు. దానికి రాము వెండికిరీటం అలంకరించాడు. గంభీరంగా, సాలంకృతంగా ఉన్న విఘ్నపతి కన్నా మోదకాన్ని ఆరగిస్తూ పరవశిస్తున్న మూషికరాజమే ముద్దుగా కుదిరిందని నాకు రవంత అనుమానం.

ఉదయం పదిన్నర దాటుతూండగా పిల్లమూక ఆశ్రమం అడవిలో తిరిగి దేవదారు, మద్ది, మరువం తప్ప మిగిలిన పత్రి పద్దెనిమిది రకాలూ పోగుజేసుకువచ్చారు. బాబాతోటలో నుంచీ జామ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, నారింజ కోసుకువచ్చారు. వెలగ, యాపిల్, కమలాలు కొని తెచ్చారు. అక్కయ్యలు నివేదనకు కుడుములు, పాలతాలికలు, గారెలు వంటి పిండివంటలు తయారుచేసారు. పదకొండు గంటలకు పూజ ప్రారంభమైంది-'శుక్లాంబరధరం'తో. పూజానంతరం కథా వివరణ జరిగాక అందరూ శిరస్సులపై అక్షతలు చల్లుకొన్నారు. తోరధారణ, పుస్తక పూజలతో సహా చక్కగా పూజ పూర్తి అయ్యాక శ్రీ సాయి హారతి, ప్రసాద వినిమయం జరిగాయి. తదుపరి పిల్లలంతా ఆశ్రమానికి వచ్చి భోజనాలు చేసారు. కాస్సేపు 'బాలభారతం'లో కథలు చదువుతూండగానే పెద్దవాన మొదలైంది. ఇంకేముంది! కేకలూ, గంతులూ, పారుతున్న బుజ్జి బుజ్జి కాలువల్లో పడవలు వదలడాలు... ఒకటే సందడి. కథ చదివి అక్షతలు వేసుకున్న తరువాత గణపతి మీద చిన్న క్విజ్ ఏర్పాటు చేసారు మాతాజీ. వీడియోలో రాత్రి మైఫ్రెండ్ గణేశా చూచారు అందరూ. దానితో "పండుగ అయిపోయిందోచ్!" అనుకున్నాము.







# నిశ్శబ్ద సంగీతం

- మాతాజీ

కొన్నేళ్లక్రితం మాట. నా వ్యాపారం హఠాత్తుగా దెబ్బతిన్నది. నేను ధైర్యం కోల్పోకుండా ఎంతో ప్రయత్నం చేసాను. దాన్ని సరిచేసుకోవాలని. ఏదో అతి స్వల్పమైన మార్పు తప్ప ఆశాజనకమైన మార్పేమీ కనబడలేదు. రోజురోజుకూ పరిస్థితి దిగజారిపోతోంది. నాక్కూడా నీరసం, నిరాశ కలుగుతున్నాయి. పని పట్ల ఉత్సాహం కూడా చచ్చిపోతోంది. మారుతున్న ఆర్థిక పరిస్థితుల ప్రభావం నా యింటి మీదా, భార్యాపిల్లల మీదా కూడా పడుతోంది. నా విలువ క్రమంగా మారుతోంది. నాకు మెల్లగా ఏదో డిప్రెషన్‌లో కూరుకుపోతున్నట్లనిపిస్తోంది. హఠాత్తుగా ఒకరోజు నా మీద నాకే కోపం వచ్చింది. "ఛ! నేను చదివిన చదువేమిటి? ఇన్నేళ్లుగా నేను సాధించిన విజయాలేమిటి? నా అనుభవం ఏమిటి! ఇప్పుడిలా కుంగిపోవటం ఏమిటి?" నన్ను నేనే విసుక్కున్నాను. తిన్నగా ఒక ఆశ్రమంలోని స్వామీజీ దగ్గరకు వెళ్లాను. ఆయన మనస్తత్వశాస్త్ర ప్రవీణుడో, మానసిక వైద్యుడో కాదు-ఒక మామూలు స్వామీజీ-అంతే. ఆయన నా గోడు శ్రద్ధగా విన్నారు. నా వేళ్లు వణకటం, నిష్కారణంగా చెమటలు పట్టటం గమనించారు. అనుభవంతో పండిన తల ఊపి, గొప్ప జ్ఞానికుండే దీక్షతో నా కళ్లలోకి సూటిగా చూస్తూ, కొంచెంసేపు అలా కూర్చొని ఆలోచించారు. ఉన్నట్లుండి ఓ ప్రశ్న వేశారు.

"మీ బాల్యం ఆనందంగా గడిచిందా?"

"బ్రహ్మాండంగా!"

"బాల్యం అనగానే మీకు గుర్తు వచ్చే అద్భుత ప్రదేశం ఏది?

"మా ఊరు సముద్రానికి దగ్గర. సముద్రతీరం అంటే నాకు ప్రాణం".

"సరే! అలా అయితే మీకొక పని చెప్తాను-చేస్తారా?"

"తప్పకుండా!" అన్నాను.

"రేపు పూర్తిగా సముద్రతీరాననే గడపాలి మీరు. ఏడుగంటలు దాటకుండా వెళ్లండి. మీకు నాలుగు రకాల చీటీలు వ్రాసిస్తాను. మొదటిది

ఏడింటికి, రెండవది పదింటికి, మూడవది ఒంటిగంటకు, నాల్గవది నాలుగింటికి తీసి చూడాలి. అందులో ఉన్నట్లే చెయ్యాలి, ఇష్టమేనా?" మందుబిళ్లలు మ్రింగడానికి చెప్పినట్లు ఈ టైమింగ్సేమిటి!" అనిపించింది గానీ సరేనన్నాను.

"ఒక్క షరతు. అక్కడున్నంతసేపూ మీరు ఎవ్వరితోనూ మాట్లాడ కూడదు. పాటలు వినకూడదు. ఫోన్ తీసుకువెళ్లకూడదు. మీ మధ్యాహ్న భోజనం మాత్రం తీసుకువెళ్లవచ్చు-సరిగ్గా సమయానికి మాత్రమే చీటి తెరిచి చదవాలి" నాకు ఆయన ధోరణి ఏమీ అంతుబట్టలేదు. కానీ ఏది ఏమైనా ఆయన మాట అనుసరించదలుచుకొన్నపుడు యింక ఆలోచన దేనికి? సరేనన్నాను. వెంటనే స్వామీజీ నాలుగు చీటీల మీద ఏవో వ్రాసి నాకిచ్చారు. నేను ఇంటికి వెళ్లిపోయి, మరునాటి ఉదయం నాకెంతో యిష్టమైన సముద్రతీరానికి వెడుతున్నానన్న ఉత్సాహంతో హాయిగా నిద్రబోయాను.

❖ ❖ ❖

తెల్లవారుజామునే లేచి ఒక్కడినే కారు నడుపుకొంటూ సాగరతీరానికి వచ్చాను. సూర్యోదయం అయిందప్పడే. లేలేత భానుకిరణాల నారింజ వెలుగులలో కెరటాల తళతళ చూడగానే ప్రాణం లేచివచ్చినట్లైంది. ఎన్నేళ్లయింది యీ సముద్రాన్ని చూచి! చూస్తున్నాను అప్పడప్పడూ. కానీ యిలా ప్రశాంతంగా కాదు. కాస్సేపలా చూచి, కారు దిగబోతూ టైమ్ చూచుకొన్నాను. ఏడు కావస్తోంది. చొక్కా జేబులు వెదికి స్వామీజీ యిచ్చిన చీటీలలో నంబర్ 1- ఏడుగంటలు -అని వ్రాసి ఉన్న చీటీ తీసి, మడతలు విప్పి చదివాను. "జాగ్రత్తగా విను"-అని ఇంగ్లీషులో వ్రాసి ఉంది. ఇదెక్కడి గోల! ఇంత ప్రొద్దున్నే యీ పల్లెటూళ్లో యిటువైపెవ్వరూ రారు. ఒకవేళ వచ్చినా ఆయన ఎవరితోనూ మాట్లాడవద్దన్నారు గదా! సెల్ తెచ్చుకోలేదు. కార్‌లో డి.వి.డి. ప్లేయర్ ఉందిగానీ పాటలు వినకూడదన్నారని సిడీలేమీ తీసుకురాలేదు. మరి యిప్పడేం వినమంటారీ స్వామీజీ! అదీ "జాగ్రత్తగా" వినాలట! నవ్వుకొంటూ, ఈయనక్కాస్త తిక్క ఉందేమో అనుకొంటూ కారుదిగి, తలుపువేసాను. అది ధన్‌మని మ్రోగింది.





"అరె!" ఇంత గట్టి మోత వస్తుందా తలుపువేస్తే! నేనెప్పడూ గమనించలేదే!" అనుకొన్నాను. మెల్లగా సముద్రంవైపు సాగాను.

సముద్రపు హోరు - ఓసారి కాస్త పెద్దగా, ఓసారి కాస్త మెల్లగా - ఎవరో ఆరితేరిన గాయకుడు చక్కని స్వరజతులు వేస్తున్నట్లు లోతులకి వెడుతూ, పైకి వస్తూ మధ్యమధ్య అల విరిగిపడినప్పడల్లా గమకాలు పలుకుతున్నట్లు.... ఆ హోరులో లయే కాదు, తాళమూ ఉంది. అలా వింటూ వింటూ ఇసుకతిప్పలవైపు వెళ్లాను. దారిలో కాలికేదో తగిలింది. శంఖం-గుప్పెడంత ఉంది. ఇసుక దులిపి చెవి దగ్గర పెట్టుకున్నాను. ఆ సాగరఘోష శంఖంలోంచీ నా చెవిలోకి ... చిన్నప్పడు రఘునాధాలయంలో పూజారి గారిని బ్రతిమిలాడి గుడిలోని శంఖం చెవి దగ్గర పెట్టించుకొని ఆ హోరు శబ్దం వినటం గుర్తు వచ్చింది. అంతలో తల మీదుగా ఏదో విమానం వెడుతున్న శబ్దమైంది. తలెత్తి చూచాను. అది వెళ్లిపోయేదాకా ఆగి ఇసుక తిప్ప మీద కూర్చున్నాను. కిర్రుకిర్రుమంటూ ఏదో చిన్న సవ్వడి. ఇసుకలో నుంచీ మెల్లగా పైకి వచ్చింది పెద్ద పీత ఒకటి. ఒళ్లంతా వయ్యారంగా తిప్పకొంటూ మరో బొరియలోకి దూరిపోయింది. తడి యిసుక ఒళ్లంతా అంటించుకొని. అంతలో సముద్రం మీదుగా ఎగురుతూ ఓ పక్షుల బారు.... రెక్కలు టపటపలాడించుకొంటూ, ఈల వేస్తున్నట్లు చిన్నగా కూస్తూ .... ఈ పక్షి ఏమిటో-దీని కంఠం ఎంత బావుంది! అవి వెళ్లే దిక్కుగా చాలా సేపు చూస్తూ ఉండిపోయాను. గాలి విసురు పెరిగింది. కాస్త దూరంగా ఉన్న సరివి తోటల్లోంచీ దూసుకువచ్చే గాలి ఈలలు వినపడుతున్నా యిప్పడు. నా చెవికి ఏదో జానపద గీతం వంటిది వినవచ్చింది. ఎటు నుంచీ వస్తోందో ఒక పడవ - నలుగురు బెస్త యువకులతో నిండి. చేపలు బాగా పడినాయేమో మాంచి హుషారుగా ఉన్నారు కుర్రాళ్లు. ఒకడు ఏదో నాకు అర్థంగాని భాషలో పాట పాడుతున్నాడు. వాడి గొంతులో ధ్వనించే జీవచైతన్యం నన్ను ఆకర్షిస్తోంది. ఇంకొకడు ఏదో జోక్ వేసినట్లు న్నాడు-నలుగురూ ఒకేసారి పకపక నవ్వారు. జలపాతం దూకుతున్నట్లుంది ఆ నవ్వు. వాళ్లు పడవను ఒడ్డుకులాగి లంగరు వేసినంతసేపూ నీళ్లు గలగల, పడవ తడి యిసుకను కోస్తూ వచ్చేప్పటి చిత్రమైన చప్పడు వింటూ కూర్చున్నాను. వాళ్లు వెళ్లిపోయారు. ఏదో పెద్ద చేప తీరానికి రాబోతూ

చెంగున ఎగిరి తపుక్కున నీళ్లలోకి దూకింది .... అలాఅలా ... ఎన్నెన్నో సవ్వడులు వింటూ... వింటూ ఇంతసేపూ నాకు ఎటువంటి ఆలోచనలూ రాలేదు-ప్రశాంత నిర్మలంగా ఉంది. టైమ్ చూచుకొన్నాను. పది కావస్తున్నది. లేచి నిలబడి బట్టలకంటిన ఇసుక దులుపుకొన్నాను. ఆ చిన్న చప్పుడు కూడా నా చెవికి స్పష్టంగా కనిపించింది. ఎన్ని శబ్దాలు-ఎంత వైవిధ్యం-ఎంత జీవం-మరెంత సహజ మాధుర్యం! చెవిలో అయితే సెల్‌ఫోన్, లేకుంటే హెడ్ ఫోన్స్, ఎయిర్ కండిషన్‌డ్ గదులలో-సాటి వ్యాపారుల, ఉద్యోగుల సారహీనమైన నవ్వుల మధ్య-లేప్‌టాప్‌లు, ఇంటర్నెట్ల గోల మధ్య-ఛ్ఛ్-ఎన్నాళ్లైంది యింత ప్రశాంతతను అనుభవించి! స్వామీజీ మీద నమ్మకం కలగటం మొదలైంది.

మెల్లగా చెయ్యి జేబులోకి వెళ్లింది. రెండవ చీటీలో "వెనక్కు వెళ్లే ప్రయత్నం చెయ్యి" అని ఉంది ఆంగ్లంలోనే. వెనక్కా? ఎంతవరకు? శైశవం దాకానా? చీటీ జేబులో పడేసుకొని, చేతులు కట్టుకొని మెల్లగా ముందుకు నడుస్తూ వెనక్కు వెళ్లసాగాను. ఇటీవలి కాలంలో జరిగినవి నాకు ఆనందప్రదాలు కావు. అంచేత మనసు చాలా చిన్నదై బాల్యంలోకి పరుగులు తీసింది. నేను, అన్నయ్య, చెల్లీ ఎన్నెన్నో ఆటలు ఆడుకొనే వాళ్లం అదుగో ఆ సరివి తోటల్లోనూ, ఈ సముద్రపు ఒడ్డునా, ఊళ్లోని లక్ష్మీ నారాయణస్వామి గుడి మంటపంలోనూను. శివాలయం ప్రక్కన చెరువులో దిగి ఆల్చిప్పలు ఏరుకొచ్చి నాయనమ్మకివ్వటం-పరాస మండలు విరిచి కట్టకట్టి చీపురులాగా చేసి దానితో స్కూలు ఆవరణ ఊడవటం-దసరాలు వస్తే కోతి బొమ్మలు, విల్లంబులు, పాటలు-సంక్రాంతి, భోగి మంటల కోసం కంపా కట్టే పోగు చెయ్యడానికి గజగజలాడించే ధనుర్మాసపు రాత్రులలో ఊరంతా తిరగటం-ఓసారి భోగి మంటల్లో చెయ్యి కాలిన మచ్చ యింకా ఉంది-ఐదో తరగతిలో ఉన్నప్పడు వెళ్లిన విహారయాత్ర- ఎంతసేపు అలా తిరుగుతూ ఉండిపోయానో బాల్యంలో. చెవిలో సన్నని, మెత్తని గొంతు ఏదో వినిపిస్తోంది. ఆఁ! అది సుచరితదే. మంచి స్నేహితురాలు. హైస్కూలుదాటాక మిత్రులందరూ విడిపోయారు. మెదడు పొరల్లో ఎవరో చిన్న పిల్లలు సముద్రంలోకి పరుగెడుతూ-అవును ముందు పరుగెత్తేది చెల్లి. అది మహాదుడుకుది. భయం అంటే ఏమిటో





తెలియదు దానికి. ఎప్పడిక్కడికి వచ్చినా సముద్రంలో దిగడానికి ముందుకు దూకు తుండేది. అన్నయ్యకేమో నీళ్లంటే చచ్చే ఎలర్జీ. ఇసుకలో శంఖాలేరుకోవటం, బొరియల్లో దాక్కున్న నత్తలను బయటికి రప్పించటం, ఇసుకతో కోటలు కట్టటం తప్ప సముద్రంలోకి ఛస్తే దిగేవాడు కాడు. చెల్లేమో ఆగేది కాదు. మధ్యలో తాను. చెల్లిని ఆపుతూ, అన్నయ్యను రమ్మని లాగుతూ... నాన్న పుత్రోత్సాహం నిండిన కళ్లతో చేతులూపుతూ స్నానం చేస్తూ .... ఆగి ఉన్న పడవ అంచున కూర్చొని మా స్నానాలయ్యాక పెట్టటానికి తాను తెచ్చిన దిబ్బరొట్టెకు తేనె, పచ్చడి రాస్తూ అమ్మ ... అలా అలా ఆ సజీవ చిత్రాలు మనసు లోతుల్లో వెదుక్కొంటూ-మిత్రులందరి కోలాహలాపు కంఠాలలోని చేతనతో తడుస్తూ ... ఎక్కడో పెద్ద పక్షి కూతతో యీ లోకంలోకి వచ్చాను. గాఢంగా నిట్టూర్చి టైమ్ చూచుకొన్నాను. మధ్యాహ్నం దాటింది. పేంట్‌జేబుల్లో చేతులు పెట్టుకొని కారు వైపు సాగాను. జీవితం ఎంత చిత్రమైనది! ఎందుకు ఎవరిని కలుపుతుందో ఎందుకు విడగొడుతుందో తెలియదు. ఒకే ఆత్మ- విభిన్న శరీరాలుగా బ్రతికిన ఆనాటి మిత్రులు, రక్తబంధువులు ఇప్పడెక్కడ? కొందరు కాలగతిలో కలిగిపోయారు. అన్నయ్య వేల మైళ్ల దూరాన- సముద్రాలకు అవతల. చెల్లి హిమాలయాల దగ్గర ఏదో ఆశ్రమంలో. .... కారులో ఉన్న భోజనం బయటికి తెచ్చుకొని ఓ రాతి మీద కూర్చున్నాను. జ్ఞాపకాలంత రుచిగా అనిపించలేదు భోజనం. వేడెక్కిన ఇసుకలో కాళ్లు-ఎదురుగా అనంత సాగరం. ఒంటి గంటయింది. మూడో చీటీకి వేళయింది. జ్ఞాపకాలు విదిలించుకొని చీటీ తీసాను.

"జీవితం పట్ల నీ భావాలను పునఃపరిశీలించుకో". నాకు రవంత చికాకు కలిగింది. ఒక్కక్షణం సర్రున కోపం కూడా వచ్చింది-నిష్కారణంగా. ఏం నా భావాలకేమైంది? మనిషైన ప్రతివాడికీ తన జీవితంలో పైకి రావాలనీ, బాగా డబ్బు సంపాదించాలనీ, సుఖంగా ఉండాలనీ ఉంటుంది. తనకీ అలాగే ఉంది. "జరామరణాలు లేని వారివలె విద్యాధనంబుల గడింపవలె" అన్నారు పెద్దలు. అందులో తప్పేముంది? డబ్బుతోపాటే కీర్తి, సుఖమూ కూడా దొరుకుతాయి. అవి పొందటం కోసమే తాను శ్రమించాడు. అయినా-తనొక్కడే అనుభవించాడా ఏమిటి! ...... హఠాత్తుగా

ఏదో మార్మిక శబ్దం-చిన్న మూలుగులాగా. ఎక్కడ? నా ఆంతర్యంలోనే! "ఎంత ఆత్మవంచన!" మరో చిన్న వెక్కిరింత లోపల. "ఆఁ! నువ్వొక్కడివే అనుభవించక ఎవరికి పెట్టావు?" -కదలాడే ప్రశ్న. అవును. నా వాళ్లు, నేను నా లోకం కాక ఎవరిని గురించైనా ఆలోచిస్తున్నానా? వెనక్కు వెళ్లింది మనసు. ప్రారంభంలో నాకు సంపదనిస్తున్న భగవంతుడి పట్ల విశ్వాసం ఉండేది. నిరాడంబరంగా జీవించటం, అంతో యింతో లేమిలో ఉన్న వారికి పంచటం, నా క్రింద పనిచేసే వారి యిళ్లలో ఏవో శుభకార్యాలైతే వెళ్లి రావటం, మా యిళ్లకు వాళ్లను పిలవటం ... ఏదో అనుబంధం ఉండేది. మరి ఆ దగ్గరితనం ఎప్పుడు దూరమైంది? ఫ్యాక్టరీ తెరవటం, వ్యాపారం విస్తరించటం, క్రొత్తక్రొత్త ఉద్యోగాలు, ఉద్యోగులు, పని ఒత్తిడి .... బిజీ, బిజీ! క్రమంగా పనిని ప్రేమించే తత్త్వం తగ్గింది. యాంత్రికత పెరిగింది. సర్కిల్ మారింది-కారు రేసులు, మందు పార్టీలు, క్లబ్బులు-సామాన్యులు నన్ను దరిజేరే వీలే లేకుండా పోయింది. మెల్లమెల్లగా నా భావాలు కూడా మారిపోయాయా? అవును.... ఏవేవో దాని జ్ఞాపకాలు. ఎందుకో నా గుండె చెమరించినట్లైంది. ఆదిలో బ్రతుకుతెరువు కోసం పనిచేసాను. పదు గురితో పంచుకోవటంలో ఆనందించాను. ఇప్పుడో! కేవలం డబ్బు- బాగా, బాగా, యింకా బాగా పెంచుకోవటం కోసమే పనిచేస్తున్నాను. ఉన్నది తరిగిపోతుందేమోనని పరుల గురించి ఆలోచించటమే మానేసాను. భార్య, పిల్లలు కావాలనుకొన్నవన్నీ సమకూర్చాను. ఆర్జన పెరుగుతున్న కొద్దీ ఆబ పెరిగింది. స్వార్థం, కపటం, మరెవ్వరి కష్టసుఖాలూ పట్టించుకోని బండతనం-ఉన్నది పోయిందన్న దుఃఖం లేదు-రావలసింది అనుకొన్నంత గా రాలేదనే దుఃఖం అందుకేనా నా ఆనందం కరిగిపోయింది? నిజమే కావచ్చు. పదిమంది కోసం బ్రతికేవాడు చేసే పనిలో పరమాత్మ శక్తి ఉంటుంది. పవిత్రత ఉంటుంది. ఫలితం పట్ల నిర్లిప్తత ఉంటుంది, ఆనందం ఉంటుంది. కేవలం తన కోసమే ఆర్జించుకొనేవాడు ఇవేవీ లేక జీవచ్ఛవంతో సమాన మని శాస్త్రాలు ఘోషించాయి గదా! ఇన్నాళ్లూ యీ విషయం ఎలా మరుగున ఉండిపోయింది? కళ్లు తడుస్తున్నాయి. మరి-యిప్పుడెలా గుర్తు వచ్చింది? .... ఉదయం నుంచీ ఉన్న మౌన ఏకాంత క్షణాలు, పసితనపు పరమ ప్రీతికరపు జ్ఞాపకాలు-యివన్నీ కలిసి





పైన పేరుకొన్న మురికిని శుభ్రంగా కడిగేస్తే లోపల దాగిన సత్యపు వెలుగు పైకి వచ్చింది. స్వామీజీ పాదాల మీద తల ఉంచి నమస్కరించాను మనసులోనే. ఎంతో బరువు తొలగిన భావన. గుండెనిండా గాలి పీల్చుకొని టైమ్ చూచుకొన్నాను. నాల్గవ చీటీ తీసి చూచాను.

"నీ కష్టాలన్నీ ఇసుక మీద వ్రాసి-అలలు రావటం కోసం వేచి ఉండు". పెద్దగా హాయిగా నవ్వాను. అమ్మో, యీ స్వామీజీకి అందని ఎదలోతులు లేవనుకొంటా. ఒక శంఖపు ముక్క ఏరుకున్నాను ఇసుకలో. తడి ఇసుక మీద నా సమస్యలన్నీ వ్రాయసాగాను ఒక దాని క్రింద ఒకటిగా. చిన్నప్పుడు ఇదే తడి ఇసుకలో మా అందరి పేర్లూ పోటీపడి వ్రాసుకోవటం గుర్తు వచ్చింది. చకచక వ్రాయటం పూర్తి చేసి, నిలబడ్డాను. పైన సువిశాల నీలాకాశం. ఎదురుగా అనంత నీలిసాగరం. మధ్యన నేను. ఎంత అల్పంగా, ఎంత బలహీనంగా, ఎంత అమాయకంగా ఉన్నాను! ఎడతెగని కడలి హోరు ముందు నా కంఠం ఎంత పేలవం! తన లోపల ఎన్నెన్ని జీవులకో ఆశ్రయం యిస్తూ, అనంతమైన ముత్యాల సృష్టి కార్యానికి తోడ్పడుతూ, తనది కాని ఏది తనలోకి వచ్చినా బయటకు నెట్టివేస్తూ, తనలోని అగ్నిని తానే భరిస్తూ, నిరంతరం సంచలిస్తూ కూడా హద్దులు దాటి పొంగకుండా ఉండే ఈ మహానగరం ముందు నేను అణువైనా కాగలనా! ఈ ప్రకృతి మహాశక్తి ముందు నేనెంత? అంతపాటి దానికి ఎందుకీ తపన? నాలోలోపల ఏదో కరుగుతోంది. ఓ పె....ద్ద అల వచ్చింది. నేనెంతసేపో వ్రాసిన నా బాధలన్నిటినీ క్షణంలో తుడిచిపెట్టేసింది. చెమర్చిన కళ్ళు, చిరు నవ్వుతో విచ్చిన పెదవులు- ఓహ్! యిదే జీవిత రహస్యం! స్వామీజీ కొంటెగా నవ్వుతున్నారేమో యీ క్షణంలో నన్ను తమ భావనలో చూచి. మెల్లగా ఒళ్లు విరుచుకొన్నాను. ఎప్పుడో చిన్నప్పుడు అమ్మ నేర్పిన పాట-"ఏ మాలిక్, తేరే బంద్ హమ్..." పెదవిపై కదులుతోంది. కారు వైపు నడుస్తున్నాను. నా అడుగులు తేలికగా పడుతున్నాయిపుడు. వంగి గుప్పెట్లోకి ఇసుక తీసుకున్నాను. వేళ్ల సందుల గుండా మెల్లగా జారవిడుస్తూ నడిచాను. కారు దగ్గర నిలబడి రెండు చేతులూ ఎత్తి జలనిధికి నమస్కరించాను. కారు మెత్తగా, ఉత్సాహంగా స్వామీజీ ఆశ్రమంవైపు పరుగుతీసింది.